# భరింపరాని గోల

మా ఆవిడా, పిల్లలూ చేసే గోల భరించలేక ఆ మధ్య స్టీరియో సెట్ కొన్నాను. దాంతోబాటు పాశ్చాత్య సంగీత బాణీలోని లయ విన్యాసం (పెర్క్యూషన్ ఎన్‌సెంబుల్‌ట) ఎల్. పి. రికార్డొకటి; ఆర్. డి. బర్మన్‌గారి సంగీత దర్శకత్వంలో వొచ్చిన హిందీ సినిమా ఎల్. పి. రికార్డొకటి గ్రామఫోను షాపువారు ఉచితంగా ఇవ్వడంతో వీలైనంత శబ్దం ఉచితంగా చెయ్యడం మా ఇంట్లో వాళ్ళకి సముచితంగా తోచి, ఆ యంత్రాన్ని బొంయ్యి మనిపించడం సాగించారు. నాలుగు రోజులయ్యేక ఓనాడు మా ఎదురింటాయనా, నేనూ ఒకేసారి సిటీబస్సు దిగి కబుర్లు చెప్పుకుంటూ యిళ్ళవేపు నడుస్తూ వుండగా నేను మర్యాదకి "మేమీ మధ్య స్టీరియో ఒకటి కొన్నాం; వీలయితే మా యింటికొచ్చి వినండి" అని ఆహ్వానించేను. దాని కాయన; "మీరే మా ఇంటికొచ్చి వింటే మంచిదేమో" అని చిరునవ్వుతో చెప్తే, మేం ఎంత చప్పుడు చేస్తున్నామో ఆ క్షణానగాని అర్థం కాలేదు నాకు.

ప్రఖ్యాత పాశ్చాత్య రచయిత "డీన్ ఇంజ్— స్పీచ్ ఈజ్ సిల్వర్; బట్ సైలెన్స్ ఈజ్ గోల్డ్" అన్నాడు. శబ్దానికున్న ప్రాముఖ్యాన్ని, అవసరాన్ని గుర్తుంచుకోక తప్పనిసరై నాగరిక ప్రపంచం "శబ్దమయ ప్రపంచం" అయి కూర్చుంది. మనిషి ప్రపంచంలో పురిటి పాపగా లేవగానే ఏడుపు, దీర్ఘరోగిగా చావగానే ఏడుపు. ఈ రెండు ఏడుపుల మధ్య ప్రతి మానవుడు యథాశక్తి ఎంతో కొంత తానేడుస్తూ యితరుల్ని ఏడిపిస్తూ వుండక తప్పడంలేదు. అంచేత డిన్ ఇంజ్ "బంగారం" అన్నా, "ప్లాటినం" అన్నా మరోటేదో అన్నా నిశ్శబ్దాన్ని పాటించడం మానవుడికి సాధ్యంకాని పనైంది.

రామలక్ష్మిగారని, మా దూరపు చుట్టం ఒకావిడ ఆర్నెల్లు మెటర్నిటీ లీవ్ తరవాత మూడు నెలల పాపని ఎత్తుకుని వూళ్ళో కొచ్చిన

సందర్భంగా చిన్న పేరంటం లాంటిది ఏర్పాటుచేస్తే నేనూ, మా ఆవిడా నాలుగు అక్షింతలు వేద్దామని వెళ్ళేం. పలకరింపులూ అవీ అయ్యాక మా ఆవిడ అడిగింది: "రాత్రిపూట మీ పాపాయి పాల కేడిస్తే మీ ఆయనా, మీరా ? ముందెవరు లేస్తారు." దాని కావిడ నిర్భయంగా "మా పక్కింటి వాళ్ళు" అని సమాధానం చెప్పింది.

"అవును మరి. మొగుడూ పెళ్ళాం ఇద్దరూ ఉద్యోగాలు చేసుకుంటున్నారు. పగలల్లా చాకిరీలు చేస్సేసి అలిసిపోయి నిద్రపోతారు. ఆ పాపాయి ఎంత యేడిస్తే మెలకువ వొస్తుంది వాళ్ళకి !" అని మా ఆవిణ్ణి సముదాయించబోయాను నేను ఇంటికొస్తూనూ.

డీన్ ఇంజ్‌గారి వాక్యాన్ని అక్షరాలా పాటించే వాడొకాయన. సుబ్బారావు అద్దె కుండడానికి యిల్లు వెతికేటప్పుడు తట స్థపడ్డాడు. ఇల్లు చూసేం, నచ్చింది. ఆయనా ఇవ్వడానికి సుముఖంగానే వున్నాడు. "అయితే వొకమాట" అని, "మీకు కుక్కలేదు కదా ?" అన్నాడు ఇంటిగలాయన.

"అబ్బే, లేదండి" అన్నాడు సుబ్బారావు.

"రేడియో వుందా ?"

"లేదండి"

"గ్రామఫోన్ ?"

"అదీ లేదండి."

"సంగీతం నేర్చుకునే చెల్లెళ్లు, హార్మోనియం అలాంటివి ?"

"లేవండి."

"అలారం గడియారం ?"

"అదీ లేదండి."

"చీటికీ మాటికీ ఏడ్చి కింకపట్టు పట్టే పిల్లలు ?"

"లేరండి; మా కసలు పిల్లలే లేరింకానూ."

"మంచిది !" అన్నాడు ఇంటిగలాయన. "అంటే మీకు పిల్లలు పుట్టకూడదనీ, మీరు నిస్సంతుగా ఈ లోకంనుంచి నిష్క్రి

మించాలనీ నా అభిలాష కాదనుకోండి. నాకు కొంచెం చప్పుడంటే యిబ్బంది. అంచేత అలా అడిగేను, మరేం అనుకోకండి. రేపే వొచ్చి చేరండి!''

సుబ్బారావు గేటుదాకా వొచ్చేసినవాడే, మళ్ళా వెనక్కెళ్ళి, ''అయ్యా ఒక్క మనవి!'' అన్నాడు.

''చెప్పండి.''

''నా దగ్గిర పాతకాలంనాటి పార్కర్ పెన్ను ఒక టుందండి. అది మా నాన్నగారు నాకు ముట్టచెప్పిన ఒకే ఒక వస్తుసామగ్రి. రాసేటప్పుడు ఆ పెన్ను బర బరా చప్పుడు చేస్తుంది. పగలు తెలీదు గానండి; రాత్రి పూటయితే ఆ చప్పుడు కొంచెం యెక్కువే ననిపిస్తుం దండి నాకే....ముందుగా చెప్పాలి కదండీ! మీకేమైనా అభ్యంతరమా?"

అంతే! సుబ్బారావుకి ఆ యిల్లు దొరకలేదు మరి.

* * *

''సెన్స్-ఓ-సౌండ్ సిస్టం పెట్టి శారదాంబా 70 ఎమ్. ఎమ్. హాల్లో- సినిమా వేస్తున్నారట. వెడదామా?'' అని అడిగినట్టున్నాడు సుబ్బారావు.

కుర్రాళ్ళందరకీ పరీక్షల రోజులు, అంతకంటె కొద్దిగా పెద్ద వాళ్ళకి జీవితంలో అసలైన పరీక్షగా పేర్కొనదగిన పెళ్ళిరోజులు. లౌడ్ స్పీకర్లతో చెవులు ఘళ్ళడిపోయి, మామూలుగా యెవరైనా మాట్లాడితే వినబడ్డం మానేసింది. ''ఏమిటీ'' అన్నాను, చెవిటివాళ్ళాగ గట్టిగా అరుస్తూ.

నావేపు కొర కొర చూసి, కాయితంమీద రాసిచ్చేడు, ఆ ప్రశ్న. ''ఇరవై నాలుగు ఛానెల్సుగల స్టీరియో ఫోనిక్ సౌండ్ సిస్టమ్‌ట. సెన్స్-ఓ-సౌండట!'' అని కలిపాడు. చివరిమాట ఇంగ్లీషులో రాయడాన్ని కాబోలు, ''సెన్స్-జీరో-సౌండ్" అని నాకర్థమైంది, రానన్నాను.

''నిన్ను భగవంతుడు కూడా రక్షించలేడు. నే వెడతా''నని గబగబా శారదాంబా జంక్షన్‌కి దారితీశాడు సుబ్బారావు.

(22-4-78)